
సంతపేట హైస్కూల్‌లో ఓటు వేసేందుకు వచ్చిన దివ్యాంగునికి సాయం చేస్తున్న పోలీసులు


చంద్రంపాలెం హైస్కూల్లో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల ఫోన్లు


చంటిబిడ్డతో ఓటు వేసేందుకు వచ్చిన పద్మ


ఓటు వేయడానికి వచ్చిన దివ్యాంగుడు గణేష్


చంద్రంపాలెంలో ఓటు వేసేందుకు వస్తున్న దివ్యాంగ గ్రాడ్యుయేట్


ఆనందపురం పోలింగ్ బూత్ వద్ద నాలుగు గంటల తర్వాత నిరీక్షిస్తున్న ఓటర్లు

పోలింగ్ ప్రశాంతం

- ఉత్సాహంగా తరలివచ్చిన పట్టభద్రులు
- నియోజకవర్గంలో 63 శాతం ఓటింగ్

తగరపువలస: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ భీమిలి నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ ప్రారంభం నుంచి ముగింపు వరకు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. నియోజకవర్గంలోని భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలతోపాటు జీవీఎంసీ 1 నుంచి 8వ వార్డుల వరకు పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నియోజకవర్గానికే చివరి పోలింగ్ కేంద్రమైన 297, 297ఏ బూత్‌లను సంతపేట అంబేడ్కరు జీవీఎంసీ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. ఇక్కడ 1427 మంది ఓటర్లకు 1010 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ గడువు ముగిసిన తర్వాత పదుల సంఖ్యలో ఉన్న ఓటర్లను అనుమతించి గేట్లు మూసివేశారు. బ్యాంకులు, ప్రైవేట్ పాఠశాలలు, దివీస్ లేబొరేటరీ ఉద్యోగులు ఓటు వేయడానికి తమ ఉద్యోగులకు సమయం కేటాయించడంతో ఉదయం నుంచే ఓటర్లతో 297వ నంబరు బూత్ రద్దీగా కనిపించింది. తక్కువ ఓటర్లు కలిగిన 297ఏ బూత్ ఖాళీగా కనిపించింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. దివ్యాంగులైన ఓటర్లకు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సాయం చేశారు.

ఆనందపురంలో 72.06 శాతం ఓటింగ్

ఆనందపురం : ఆనందపురం ఉన్నత పాఠశాలలోని రెండు బూత్‌లలో సోమవారం జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నడూ లేని విధంగా స్థానిక ఎన్నికల పోలింగ్‌ను తలదన్నేలా రికార్డు స్థాయిలో రెండు పోలింగ్ కేంద్రాల్లో 1600 ఓటర్లకు 1153 మంది తమ ఓటు హక్కుని వినియోగించుకోగా 72.06 శాతం ఓటింగ్ నమోదైంది. ఈ పోలింగ్‌లో వృద్ధులు, దివ్యాంగులు, ఉద్యోగులు, నిరుద్యోగ పట్టభద్రులు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ మందకొడిగా సాగి 10 గంటలకు 16.67 శాతం, 12 గంటలకు 28.56 శాతం జరిగి, మధ్యాహ్నం 2 గంటలకు 45.6 శాతానికి చేరుకుంది. ఆ తర్వాత ఊపందుకొని పోలింగ్ గడువు ముగిసే 4 గంటల సమయానికి 61.50 శాతం నమోదయింది. అయితే అప్పటికే పోలింగ్ కేంద్రాల వద్ద సుమారు 160 మంది నిరీక్షిస్తుండగా ప్రధాన గేట్లను మూసివేసి, వారందరికీ అధికారులు టోకెన్లు జారీ చేసి పోలింగ్‌కు అనుమతించారు. దీంతో పోలింగ్ 5 గంటలు వరకూ కొనసాగింది. భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు పసుపులేటి బాలరాజు పర్యటించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, సీనియర్ నాయకుడు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు తదితరులతో ఓటింగ్‌పై చర్చించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రామచంద్రరావు ఆధ్వర్యంలో 144వ సెక్షన్ అమలు పరిచి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.

పద్మనాభంలో 73 శాతం పోలింగ్

పద్మనాభం: పద్మనాభంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో 73.1 శాతం పోలింగ్ జరిగింది. 1067 మంది ఓటర్లకు 780 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైఎస్సార్ సీపీ శిబిరాన్ని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సందర్శించి పలు సూచనలు చేశారు. సాయంత్రం 6.30 గంటల వరకు పోలింగ్ జరిగింది.

కొమ్మాది: ఎమ్మెల్సీ ఎన్నికలు జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో గల మేరీ స్టెల్లా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు నిర్వహించిన ఎన్నికల్లో మూడు పోలింగ్ కేంద్రాల్లో 3517 ఓట్లుకు 2070 పోలయ్యాయని అధికారులు తెలిపారు. ఎన్నికల సమయంలో ఓట్లు వేసేందుకు వచ్చిన ఓటర్ల మొబైల్ ఫోన్లు బూత్‌లోకి అనుమతించకపోవడంతో ఓటర్లు కాస్త అసహనానికి గురయ్యారు. పోలింగ్ కేంద్రాలను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల పరిశీలించారు.

భీమిలిలో రాత్రి 8 : 20 గంటలకు ముగిసిన పోలింగ్

భీమునిపట్నం: భీమిలిలోని ఎగువపేట సమీపంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల వద్ద పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఇక్కడి 295, 296 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం 68.07శాతం పోలింగ్ జరిగింది. సాయంత్రం నాలుగు గంటలు దాటిన తర్వాత కూడా ఓటర్లు భారీగా క్యూలో ఉండడంతో వారికి ఓటు వేసేందుకు అధికారులు అవకాశం ఇచ్చారు. క్యూలో ఉన్నవారికి స్లిప్పులు అందించారు. ఈ రెండు కేంద్రాల్లోనూ రాత్రి 8 : 20 గంటల వరకూ ఓటింగ్ జరిగింది. సీఐ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేయగా వారు ఇబ్బందులు లేకుండా చూసుకున్నారు. ఈ సందర్భంగా క్రైం డీసీపీ గంధం నాగన్న కేంద్రాల వద్దకు విచ్చేసి పోలింగ్ తీరును పరిశీలించారు. గతంలో ఇంతమంది పట్టభద్ర ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేదు. అలాగే రాత్రి వరకు పోలింగ్ కూడా జరగలేదు. మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ శిబిరంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పాల్గొని ఓటర్లకు స్లిప్‌లను అందించారు.

బూత్‌లు మారిపోవడంతో తీవ్ర ఇబ్బందులు

ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి భీమిలిలో రెండు, తగరపువలసలో రెండు పోలింగ్ బూత్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. పద్ధతి ప్రకారం ఆయా బూత్‌ల పరిధిలోని ఓటర్లు అక్కడ ఓటు వేయాలి. జాబితాలు కూడా అలాగే ఉంటాయి. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల భీమిలిలోని ఓటర్లు తగరపువలస, అక్కడి ఓటర్లు ఇక్కడ పోలింగ్ కేంద్రాల జాబితాల్లో వందల సంఖ్యలో నమోదయ్యారు. దీంతో అక్కడి ఓటర్లు ఇక్కడికి, ఇక్కడి వారు అక్కడికి వెళ్లి ఓటేయాల్సి వచ్చింది. అధికారుల వైఖరిపై వారంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మధురవాడ: ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ మధురవాడలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు ప్రశాంతంగా జరిగింది. ఇక్కడ 6 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 5,904 మంది ఓటర్లలో 3,393 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సెల్‌ఫోన్లను లోపలికి అనుమతించకపోవడం, వాటిని భద్రపరచుకునే కౌంటర్ ఏర్పాటు చేయకపోవడంపై పలువురు ఓటర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ సరళి, వాహనాల పార్కింగ్, క్యూ లైన్లను డీసీపీ - 1 సుమిత్ సునీల్ గరుడ పరిశీలించారు. వైఎస్సార్ సీపీ మద్దతుతో పోటీ చేసిన సీతంరాజు సుధాకర్ అనుచరులు ఏర్పాటు చేసిన టెంట్‌లను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ పరిశీలకుడు పసుపులేటి బాలరాజు పరిశీలించారు. వారితోపాటు మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, బొట్ట అప్పలరాజు, గాదే రోశిరెడ్డి, నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లా సుజాత ఉన్నారు. టీడీపీ మద్దతుతో పోటీ చేసిన చిరంజీవిరావుకి మద్దతుగా ఏర్పాటు చేసిన టెంట్‌లను ఆ పార్టీ నాయకులు భరత్, కోరాడ రాజబాబు, మొల్లి లక్ష్మణరావు, పిళ్లా వెంకటరావు పరిశీలించారు.

భీమిలి వాసులకు విజయనగరం జిల్లాలో ఓట్లు

తగరపువలస: పలువురు భీమిలి వాసులకు ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లు విజయనగరం జిల్లాలో కేటాయించారు. జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వలందపేటకు చెందిన చిల్ల బాల అప్పన్నరెడ్డికి 55 కిలో మీటర్ల దూరంలోని వేపాడ మండల కేంద్రంలో, అదే గ్రామానికి చెందిన యోగీశ్వరరావు, మోహినీదేవికి భోగాపురం మండల కేంద్రంలో పోలింగ్ కేంద్రాలను కేటాయించారు. దూరమైనా తమకు కేటాయించిన కేంద్రాలకు బాధ్యతతో వెళ్లి ఓటేసిన వీరిని పలువురు అభినందించారు.

ఇదీ పోలింగ్ సరళి

బూత్ నంబరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
285	1332	764	57
286	1323	694	52
287	945	628	66
287ఏ	484	278	57
288	886	546	62
288ఏ	934	481	51
289	1227	730	59
290	1242	730	59
291	1048	610	58
292	1067	780	73
293	781	592	76
294	819	561	68
295	1348	901	67
296	1391	947	68
297	857	624	73
297ఏ	570	386	68
మొత్తం	16,254	10,252	63


భీమిలి ఎగువపేట ప్రాథమికోన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు


భీమిలిలో రాత్రి ఏడు గంటల సమయంలో ఓట్లు వేయడానికి బారులు తీరిన ఓటర్లు


భీమిలిలో సాయంత్రం నాలుగు గంటలకు క్యూలో ఉన్న వారికి స్లిప్‌లు అందిస్తున్న రెవెన్యూ సిబ్బంది


ఆనందపురంలో ఓటరుకు స్లిప్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


వైఎస్సార్‌సీపీ శిబిరంలో ఓటర్లకు స్లిప్ అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


మధురవాడలో పోలింగ్ సరళి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


చంద్రంపాలెం హైస్కూల్‌లో ఓటింగ్ సరళి పరిశీలిస్తున్న డీసీపీ సుమిత్ సునీల్ గరుడ


భీమిలిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న క్రైం డీసీపీ నాగన్న, పోలీసు అధికారులు


చంద్రంపాలెం హైస్కూల్ పోలింగ్ స్టేషన్ వద్ద అభివాదం చేస్తున్న టీడీపీ నాయకుడు భరత్

క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


భూమి పూజ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెంలో శ్రీ జానకీమాత సహిత నగరాధీశ శ్రీ కల్యాణ రామచంద్ర స్వామి దేవాలయం శంకుస్థాపన సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా శాస్త్రోక్తంగా భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


సరకులు పంపిణీ చేస్తున్న జంగం జోషి

పద్మనాభం: మండలంలోని పెంట గ్రామంలో ఇటీవల మృతిచెందిన దాసరి సత్తిబాబు కుటుంబానికి పద్మనాభం మండల ఆర్‌ఎంపీల సంఘం తరపున రూ.4వేలు నగదు, రూ.4 వేల విలువ చేసే నిత్యావసర సరకులు అందజేశారు. పద్మనాభం మండల ఆర్‌ఎంపీల సంఘం అధ్యక్షుడు రాలి అప్పారావు, ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ అధ్యక్షుడు మమ్మల తిరుపతిరావు, యు.తాతబాబు, ఎం.వి.ప్రసాద్, పి.రామారావు, షేక్ సైదావల్లీ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తగరపువలస: చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ బొట్ట రవి తెలిపారు. ఈ అంతరాయం కారణంగా సంతపేట, కొత్తపేట, గణేష్ థియేటర్ వీధి, భీమిలి రోడ్డు, కొండపేట, కొండపేట పంప్‌హౌస్, ఆదర్శనగర్, శారద పబ్లిక్ స్కూల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

గీతం అధ్యాపకులకు శిక్షణ

కొమ్మాది: నూతనంగా బోధన వృత్తిని స్వీకరించిన అధ్యాపకులకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిరంతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వర్సిటీ అకడమిక్ ప్రో వీసీ ప్రొఫెసర్ జయశంకర వారియర్ అన్నారు. నూతన విద్యావిధానంలో చోటు చేసుకున్న మార్పులు, ఐటీ విధానంతో ముడిపడిన బోధనా విధానాలు అధ్యాపకులు అర్థం చేసుకుని కాలానికి అనుగుణంగా బోధనలో ఉన్నత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ వై.గౌతమ్ రావు, జీవీఆర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ఐఈటీఈ సాంకేతిక ఉత్సవం

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగానికి అనుబంధంగా గల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీకమ్యూనికేషన్ ఇంజినీర్స్ (ఐఈటీఈ) ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సాంకేతిక యువజనోత్సవం ఐస్పేర్ ఆర్ - 2023 నిర్వహిస్తున్నట్లు విభాగం అధిపతి ప్రొఫెసర్ జె.బి.సెవెస్త్రైన్ తెలిపారు. విద్యార్థుల ప్రాజెక్టుల ప్రదర్శనతోపాటు సాంకేతిక అంశాలపై నిపుణులు ప్రసంగిస్తారని తెలిపారు.

నేడు అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

డీ వార్మింగ్ మాత్రల పంపిణీకి ఏర్పాట్లు

60 వేల మందికి అందించడమే లక్ష్యం

మధురవాడ: మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పీహెచ్‌సీతోపాటు 10 యూపీహెచ్‌సీల పరిధిలో 60 వేల మంది పిల్లలకు డీ వార్మింగ్ మాత్రల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. యూపీహెచ్‌సీలు ద్వారా పంపిణీ చేయాల్సిన మాత్రలు జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మికి పీహెచ్‌సీ అధికారులు, సిబ్బంది సోమవారం అందజేశారు. వీటి పంపిణీ అన్ని చోట్ల సక్రమంగా జరిగేలా చర్యలు చేపడతామని జెడ్సీ పేర్కొన్నారు. పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యా సంస్థల్లో మంగళవారం మాత్రలు పంపిణీ చేస్తామని అధికారులు చెప్పారు. 1 నుంచి 2 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలకు ఒక ముక్క (200 మిల్లీ గ్రాములు), 2 నుంచి 19 ఏళ్ల మధ్య వయసు గల వారికి 400 ఎమ్‌జీ 1 మాత్ర అందజేస్తారు. మంగళవారం అందని విద్యార్థులకు 18న మరోసారి అందజేస్తామని సిబ్బంది తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


జెడ్సీ కనక మహాలక్ష్మికి మాత్రలు అందజేస్తున్న అధికారులు, సిబ్బంది

వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థుల విజయం ఖాయం

తగరపువలస: ప్రస్తుతం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులంతా విజయం సాధించడం ఖాయమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మధ్యాహ్నం ఆయన సంతపేట పోలింగ్ బూత్ పరిసరాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడారు. పోలింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే అభ్యర్థుల గెలుపునకు దోహదపడతాయన్నారు. ఆయనవెంట పీపీసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, పార్టీ ఒకటో వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, నాయకులు జీవీ రమణ, ఉప్పాడ నాగేశ్వరరావు, కుంచా శివరామకృష్ణ, చిప్పాడ వెంకటేష్, జీరు సుజాత, చిల్ల ప్రమీల, దుంప సాయిరెడ్డి, చింతగుంట శివ, వెంపాడ వెంకటరమణ, అక్కరమాని చినబాబు, గంధ్రేటి ఈశ్వరరావు, మద్ది మహాలక్ష్మి, చేట్ల శ్రీనివాసరెడ్డి, సరగడ నాగిరెడ్డి, తెడ్లాపు అప్పలరాజు, జగన్నాథ ఎల్లాజీ, సిమ్మల ప్రసన్న, రొక్కం శ్రీను, సీలాపు రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సంతపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తాగునీటి సరఫరాకు అంతరాయం

తగరపువలస: స్థానిక గోస్తనీనది నుంచి భీమిలిలోని 450, 800 కేఎల్ రిజర్వాయర్లకు తాగునీరు పంపింగ్ చేసే జీఆర్‌పీ పైపులైన్‌కు మరమ్మతుల కారణంగా మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు భీమిలి పట్టణానికి తాగునీటి సరఫరా నిలిపివేయనున్నారు. ఈ రెండు రోజులపాటు టాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయనున్నట్టు జెడ్సీ బి.రాము తెలిపారు. ప్రత్యామ్నాయంగా టాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా కోసం హరి (63003 89896), త్రినాథ్ (98660 46100)ను నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం: సింహగిరి వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను అధిష్టంపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అర్చకులు అందజేశారు.

డంపింగ్ యార్డును పరిశుభ్రంగా ఉంచండి


కాపులుప్పాడ డంపింగ్ యార్డులో అధికారులకు సూచనలు చేస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ - 2 పరిధిలోని కాపులుప్పాడ డంపింగ్ యార్డు, చెత్త నుంచి విద్యుత్ తయారు చేస్తున్న జిందాల్ విద్యుత్ ప్లాంట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా తక్షణ చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. అలాగే పెండింగ్ పనులు వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. జీ 20 సదస్సుకి వచ్చే వివిధ దేశాల ప్రతినిధులు ఇక్కడకు రానున్నందున అధికారులతో కలిసి సోమవారం ఆయన క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఇప్పటికే నగరంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

పలు దేశాల ప్రతినిధులు నగరంలోని ప్రాజెక్టులు వీక్షిస్తారని, అందుకు ఆయా ప్రాంతాలను మరింత శుభ్రంగా ఉంచాలని సూచించారు. జిందాల్ విద్యుత్ ప్లాంట్ వద్ద టాయిలెట్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలని, పరిసరాల్లో ప్లాస్టిక్ ఎక్కడా కనిపించకూడదని, పాడైపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటాలని సూచించారు. రోడ్డు సెంటర్ డివైడర్లలో ప్లాంటేషన్ చేసి పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ వి.సన్యాసిరావు, జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణలో విఫలం

దాబాగార్డెన్స్: మానవ హక్కుల పరిరక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయని మానవ హక్కుల కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగానే తరచూ మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయన్నారు. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ల పనితీరు దారుణంగా ఉందన్నారు. ఆ కమిషన్ల వల్ల ప్రజలకు పెద్దగా ప్రయోజనాలు చేకూరడం లేదన్నారు. మానవ హక్కుల్లో ప్రధానంగా జీవించే హక్కుని ప్రజలు కోల్పోతున్నారని అన్నారు. భావితరాలు మనుగడ సాధించాలంటే పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. మానవ హక్కులపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు తాము నిరంతరం కృషి చేస్తూనే ఉన్నామని చెప్పారు.

పారిశుధ్య పనుల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

తగరపువలస: పారిశుధ్య పనుల నిర్వహణలో సిబ్బందికి ఏమరపాటు, నిర్లక్ష్యం తగదని జెడ్సీ బొడ్డేపల్లి రాము అన్నారు. సోమవారం ఆయన జీవీఎంసీ ఒకటో వార్డులో పర్యటించారు. పలుచోట్ల అపరిశుభ్రంగా ఉండడంతో ఆయన స్పందించారు. ప్రజలు సిబ్బందికి సహకరించకుండా, ఇప్పటికీ క్లాప్ వాహనాలకు చెత్త ఇవ్వకుండా రోడ్ల పక్కన, డ్రైనేజీల్లో వేస్తున్నారన్నారు. దీనివల్ల బ్యాక్టీరియా వృద్ధి చెంది సమీపంలో నివసిస్తున్న వారు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. పారిశుధ్య పనుల నిర్వహణకు సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. ఆయనతోపాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహాలక్ష్మినాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.


కొండపేట రహదారిలో పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న జెడ్సీ రాము